# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రంలో 20 లక్షల సోలార్ రూఫ్ టాప్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

**2. 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌లోని నిడదవోలులో పర్యటించనున్నారు.**

**3. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు.**

**4. తెలంగాణలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఈరోజు ఉదయం 11గంటలకు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది.**

==========================

రాష్ట్రంలో 20 లక్షల సోలార్ రూఫ్ టాప్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మార్కాపురం మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో పీఎం సూర్య ఘర్ సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి 12 వందల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయని పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

--------------------------

రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయడం, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా, యలమదలలో ఒక కోటి రూపాయల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైయిన్ల పనులకు ఆయన నిన్న శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువతకు రానున్న రోజుల్లో 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అన్నా క్యాంటీన్లలో పేదలకు కేవలం 15 రూపాయలకే మూడు పూటల భోజనం అందిస్తున్నామన్నారు.

--------------------------

ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్న 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిడదవోలు పర్యటించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ కీర్తి చేకూరితో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న మాలకోడూరు చెరువు, చినకాశీరేవు, లారీ ఓనర్స్ అసోసియేషన్, మహిళా కళాశాల ప్రాంగణాలు తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

తెలంగాణలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఈ రోజు ఉదయం 11గంటలకు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ ఫలితాలను ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రభుత్వ కార్యదర్శి యోగితా రాణా ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేయనున్నారని వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రంలో దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులు తెలంగాణ ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లోను, స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌కు వాట్సాప్ లో 'హాయ్' అని మెసేజ్ చేసి తమ వివరాలు నమోదు చేసి ఫలితాలు తెలుసుకోవచ్చని సూచించింది.

---------------------------

అంతర్జాతీయ వ్యోమగాముల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీగగారిన్ 1961 ఏప్రిల్ 12వ తేదీన అంతరిక్షంలో ప్రయాణించిన మొదటి మానవునిగా ఘనత సాధించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఏప్రిల్ 12వ తేదీన వ్యోమగామి దినోత్సవాన్ని జరుపుకుంటూ.. వ్యోమగాములు, అంతరిక్ష శాస్త్రవేత్తలు ప్రపంచానికి అందిస్తున్న సేవలను స్మరించుకుంటున్నాం.

---------------------------

పోషణ్ పక్వాడాలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలో ఈ నెల 23వ తేదీ వరకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి ఆమె నిన్న మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల అభివృద్ధిలో తొలి రెండేళ్లు అత్యంత కీలకమని, ఈ సమయంలోనే 80 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని ఆమె వివరించారు. అలాగే పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి అలవాట్లు పిల్లల్లో ఊహాశక్తి, సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు.

---------------------------

గిరిజనుల విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వర్నాలి దేకా సూచించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ -- ఐటీడీఏలను బలోపేతం చేసే చర్యలపై హైదరాబాద్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఉభయ రాష్ట్రాల్లో ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, వాటి బలోపేతం, విభిన్న రాష్ట్రాలలో అమలు అవుతున్న విధానాలు, నిధుల వినియోగం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చ

జరిగింది. ఈ సందర్భంగా వర్నాలి డేకా మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలలో జీవనోపాధి అవకాశాలను పెంపొందించేందుకు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

-----------------------------

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే విశేష కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బా పూలే 200వ జయంతి వేడుకలు నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్ లతో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం, పూలే స్మృతి వనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ క్రీడా అకాడమీల్లో ప్రవేశాల కోసం క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె. శ్రీధర్ తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి జిల్లాల్లోని అకాడమీల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 26 నుంచి ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే అభ్యర్థులు 15 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికలు ప్రతిభా ఆధారంగా పారదర్శకంగా నిర్వహించబడతాయని చెప్పారు.

-----------------------------

ఒడిశా నుండి మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించి ఉన్న ఉత్తర-దక్షిణ ద్రోణి, ఛత్తీస్‌గఢ్, విదర్భ, మరట్వాడ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతములో ఉన్న ఉపరితల ఆవర్తనం మీదుగా కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తమిళనాడు పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయని తెలియజేస్తూ..

వాయిస్...20 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడివాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

======================